నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 1 ఫిబ్రవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కొత్తగూడెం, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైరా వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, తాతా మధు

# అభివృద్ధి ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే..

- రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- మున్సిపల్ పాలకవర్గాల సన్మానంలో కేటీఆర్

కొత్తగూడెం అర్బన్/ మధిర/ వైరా టౌన్, జనవరి 31: ఐదేళ్ల కాలంలో కొత్తగూడెం, మధిర, వైరా మున్సిపాలిటీల అభివృద్ధికి గత కేసీఆర్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేసిందని, ఆ అభివృద్ధే ఇప్పుడు కళ్లముందు కనిపిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. ఇటీవల పదవీకాలం ముగిసిన కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లతా జయాకర్, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు-విజయలక్ష్మి దంపతులను హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్లు, డివైడర్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించామని గుర్తుచేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రతిపక్షపాత్ర పోషిస్తూ ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

# మాదిగల ద్రోహి కాంగ్రెస్

## కేసీఆర్ హయాంలోనే దళితుల అభివృద్ధి: సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మం, జనవరి 31: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేదిలేదని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సండ్ర వెంకటవీరయ్య స్పష్టం చేశారు. మాదిగ జాతికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని, అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పిన ముఖ్యమంత్రి.. ఐదు నెలలు అవుతున్నా ఎందుకు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ప్రతి సందర్భంలోనూ మాదిగలకు అన్యాయం జరుగుతున్నదని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సీఎం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ఒకవైపు చెప్పుతుంటే మరోవైపు అదే పార్టీకి చెందిన మాల ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించారని, దీని వల్ల కాంగ్రెస్ పార్టీ ద్వంద నీతి బయటపడిందని అన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ డిక్లరేషన్‌లో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉంటామని ఎన్నికలకు ముందు ప్రకటన చేసిన కాంగ్రెస్ మాదిగలకు అన్యాయం చేస్తున్నదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఒక ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి పంపారని గుర్తుచేశారు. దళితబంధు కింద రూ.12 లక్షల ఇస్తానని చెప్పిన సీఎం ఇంతవరకు వాటి గురించి మాట్లాడటం లేదన్నారు. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ నిర్మిస్తే రేవంత్‌రెడ్డి కనీసం గేట్లు తీయడానికి కూడా ఇష్టపడటం లేదని, అదే అంబేద్కర్ సెక్రటేరియట్ నుంచి పాలన ఎలా చేస్తారని అది కూడా కేసీఆర్ నిర్మించింది కదా అన్నారు. వర్గీకరణకు అడ్డంకులు సృష్టించాలని కాంగ్రెస్ ప్రయత్నం చేస్తే మాదిగలకు అండగా బీఆర్ఎస్ ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అధికార ఖాతా ట్విట్టర్ ద్వారా ఫామ్‌హౌజ్ పాలన కావాలా? ప్రజాపాలన కావాలా అని అడిగితే 70 శాతం మంది ప్రజలు కేసీఆర్ పాలన రావాలని కోరుకున్నారని అన్నారు. ఖమ్మం జిల్లాలో రెండు ఎమ్మెల్యే స్థానాలను కాంగ్రెస్ మాలలకే కేటాయించిందన్నారు. ఖమ్మం జిల్లాలో మాదిగ జనాభాకు తగ్గట్లుగా కాంగ్రెస్ సీట్లు కేటాయించాలని, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలలో జరిగిన నష్టాన్ని ఈ విధంగా నివారించాలని సండ్ర డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి మాట్లాడుతూ మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, ఖమర్, శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

## ఐటీడీఏ జీసీసీ యూనిట్ ప్రత్యేక సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 31: ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా గిరిజన కుటుంబాల కోసం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆకాంక్షించారు. భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి తన చాంబర్‌లో యూనిట్ అధికారులతో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీసీసీ ద్వారా గిరిజనులు సేకరించే కరక్కాయ, ఇప్పపూలు, ఔషధ గుణాలు కలిగిన గింజలు కొనుగోలు చేయడమే కాకుండా.. వాటిని మార్కెటింగ్ చేసుకునేలా ప్రతీ డీఆర్‌డీఏలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి వారే సొంతంగా అమ్ముకునేలా యంత్రాలు సమకూరుస్తామని పేర్కొన్నారు. దీనిపై గిరిజన మహిళలకు శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు పొందేలా చూడాలని, జాబ్ కార్డు హోల్డర్లకు ఈజీఎస్ ద్వారా 100 రోజుల పని కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఆర్‌సీవో గురుకులం నాగార్జునరావు, డీటీఆర్‌వోఎఫ్‌ఆర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ క్యాంపస్‌ను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

**ఐటీడీఏ క్యాంపస్‌ను పరిశీలించిన కలెక్టర్**

ఐటీడీఏ కార్యాలయంలోని క్యాంపస్ పరిసరాలను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పరిశీలించారు. ఐటీడీఏ పక్కన మైదానంలో వర్షపు నీరు చేరకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. సందర్శకులు సేదతీరడానికి పక్కనే ఉన్న పార్కును, ఐటీడీఏ క్యాంటీన్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలన్నారు. అనంతరం రాశివనం పార్కు, కలెక్టర్ క్యాంప్ ఆఫీస్, పీఎంఆర్‌సీ కార్యాలయం, నాప్‌కిన్, మిల్లెట్ బిస్కెట్ యూనిట్, కోయ బొమ్మల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

గత ఏడాది ప్రజాపాలనలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న వృద్ధులు (ఫైల్)

# ఆసరా ఏది?

- రూ.2 వేలు పెంచుతామన్న కాంగ్రెస్ 'ఎన్నికల' హామీ ఎటుపోయింది?
- ఇప్పటికీ కేసీఆర్ సర్కారు నాటి రూ.2,016, రూ.4,016 పింఛన్లే పంపిణీ
- ఓట్లు ముగిసి అధికారం 'చేతి'కొచ్చాక ఎన్నికల హామీని అటకెక్కించారా?
- మరి 'ప్రజాపాలన'లో తీసుకున్న కొత్త పింఛన్ల దరఖాస్తుల మాటేమిటి?
- ఏడాది దాటినా 'భద్రాద్రి'లో పెండింగ్‌లోనే 45,332 కొత్త దరఖాస్తులు
- పెంచిన పింఛన్ కోసం ఆశగా ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు
- దయనీయంగా దివ్యాంగులు.. అడియాశలవుతున్న రూ.6 వేల పింఛన్..

'మొదట హామీ ఇవ్వడం.. తరువాత దానిని అటకెక్కించడం..' అనేది కాంగ్రెస్ సర్కారు నానుడిగా మారుతోంది. 'హస్త'వాసుల పాలనకు ఏడాది దాటిపోయినా వారి హామీల అమలుకు మాత్రం అతీగతీ లేకుండాపోతోంది. రోజులు, నెలలేగాక ఏకంగా ఏళ్లు కూడా దాటిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆరు గ్యారెంటీల ఆశచూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఏడాది కాలం గడిచిపోయినా చివరికి ఒక్క హామీని కూడా చక్కగా అమలు చేసిన పాపానపోలేదు. దీంతో పెంచిన పింఛన్ కోసం ఇన్నాళ్లూ ఆశగా ఎదురుచూసిన పండుటాకులు, వితంతువుల్లో తీవ్ర అసహనం పెల్లుబుకుతోంది. ఇక దివ్యాంగుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. రూ.6 వేల పింఛన్‌పై వారు అనేక ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆఖరికి అవన్నీ అడియాశలవుతున్నాయి. పెంచిన పింఛన్‌ను అందించకుండా ఏళ్ల తరబడి జాప్యం చేస్తుండడంతో ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఇప్పటికే ఉన్న పింఛన్లకు పెంచిన పింఛన్ మొత్తాన్ని ఇవ్వకుండా ఏళ్లు గడుపుతున్న కాంగ్రెస్ సర్కారు.. ఇక కొత్తగా పెట్టుకున్న తమ దరఖాస్తులకు ఎప్పుడు మోక్షం కలిగిస్తుందోనంటూ కొత్త దరఖాస్తుదారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా రూ.2 వేల చొప్పున పింఛన్లు పెంచి ఇస్తామన్న మాట ఏమైందని, కొత్తలో 'ప్రజాపాలన' సభల్లో తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయని నిరుపేదలు ప్రశ్నిస్తున్నారు.

–భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 31 (నమస్తే తెలంగాణ)

## ఇప్పటికీ పాత పింఛనేనా?

తమది ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయి రెండు నెలలు అవుతోంది. కానీ.. ఇప్పటికీ ఆసరా పింఛన్‌దారులకు గత కేసీఆర్ ప్రభుత్వం నాటి పాత పింఛనే అందుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,16,999 మంది ఆసరా పథకం పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ఇప్పటికీ రూ.2,016, రూ.4,016 చొప్పున ప్రతి నెలా రూ.26.49 కోట్లు జమ అవుతున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం నాటి నుంచి వస్తున్న ఈ మొత్తమే ఇప్పటికీ జమ అవుతోంది. కానీ.. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ప్రకారం రూ.2 వేల చొప్పున పింఛన్ పెరగలేదు. జమ కావడం లేదు.

### చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నా..

కొత్త పింఛన్ ఎప్పుడొస్తదని అధికారులను అడిగినా, నాయకులు అడిగినా 'వస్తది వస్తది' అంటూ సమాధానం ఇస్తున్నారు తప్ప ఇప్పటికీ రావడం లేదు. గ్రామసభల్లో చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికీ పింఛన్ రావడం లేదు. నాకు వినపడదు. మతి సరిగ్గా ఉండదు. దివ్యాంగుడి కోటాలో ఆసరా పింఛన్ రావాలి. నా ఆరోగ్యం అసలు బాగాలేదు. సర్కారు ఇచ్చే పింఛన్ కోసం ఎదురుచూస్తున్నాను.

–బట్టు సత్యప్రసాద్, లచ్చగూడెం, టేకులపల్లి

### పాత పింఛనే ఇస్తున్నారు..

గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన పింఛన్ మొత్తాన్నే ఇప్పటికీ ఇస్తున్నారు. మాట ఇచ్చిన ప్రకారం పింఛన్ పెంచి ఇస్తామని కొత్త ప్రభుత్వం చెప్పింది. కానీ.. సంవత్సరం దాటిపోయినా ఇంకా ఇవ్వడం లేదు. కొత్త ప్రభుత్వం రాగానే.. పెంచిన పింఛన్ ఇస్తుందని ఆశపడ్డాను. బ్యాంకుకు వెళ్లిన ప్రతిసారీ చెక్ చేసుకుంటున్నాను. కానీ.. పాత పింఛనే పడుతోంది.

–చలమల వెంకమ్మ, పోకలగూడెం, చండ్రుగొండ

గత కేసీఆర్ సర్కారు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.2,016, రూ.4,016 చొప్పున ఇస్తున్న ఆసరా పింఛన్లకు తాము మరో రూ.2000 కలుపుతామని, తాము అధికారంలోకి రాగానే రూ.4,016, రూ.6,016 చొప్పున పెంచిన పింఛన్లను జమ చేస్తామని గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆసరా పింఛన్‌దారులకు అలా రూ.2 వేల ఆశచూపి అధికారంలోకి వచ్చింది. కానీ.. అప్పటి నుంచి ఇప్పటి దాకా పింఛన్ మొత్తాన్ని పెంచకుండా, దానిని లబ్ధిదారులకు జమ చేయకుండా చుక్కలు చూపిస్తోంది. ఇక వీరేగాక.. ఇవే పింఛన్ల కోసం భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 45,332 మంది దరఖాస్తు చేసుకొని ఉన్నారు. వీరి పింఛన్లు ఇప్పటికే ఆమోదం పొందలేదు. తమకెప్పుడు పింఛన్లు ఇస్తారోనంటూ వారు కూడా ఎదురుచూస్తున్నారు. ఇక కొత్త పింఛన్ దరఖాస్తుదారులు కూడా రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వం మరోసారి అవకాశమిస్తే దరఖాస్తు చేసుకునేందుకు వారు కూడా సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే మొన్నటి గ్రామాల్లో కేవలం నాలుగు పథకాల(ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా) పథకాలకు మాత్రమే ప్రభుత్వం నూతన దరఖాస్తులను ఆహ్వానించినప్పటికీ కొత్త పింఛన్ కోసం కూడా మరికొందరు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో చాలామంది ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

దరఖాస్తుల స్థితిని అడిగి తెలుసుకుంటున్న దరఖాస్తుదారులు (ఫైల్)

### పెంచిన పింఛన్ పడిందా సారూ..

గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో అందించిన రూ.2,016, రూ.4,016 పింఛన్లే ఇప్పటికీ దిక్కవుతున్నాయి. రేవంత్ సర్కారు హామీ ఇచ్చిన పెంచిన పింఛన్ మొత్తం ఎప్పుడు జమ అవుతుందా? అని ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు. పింఛన్ నగదును డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లిన ప్రతి సమయంలోనూ బ్యాంకు అధికారులను; గ్రామంలో కలిసిన ప్రతి సందర్భంలోనూ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులను అడిగి తెలుసుకుంటూనే ఉన్నారు. 'పెంచిన పింఛన్ జమ అయిందా?' అంటూ ఆశగా, అమాయకంగా బ్యాంకర్లను అడుగుతుండడం, 'కొత్త పింఛన్ పడలేదు. పాత పింఛనే జమ అయింది' అంటూ వారి సమాధానం చెబుతుండడం, నిట్టూర్చుకుంటూ పింఛన్‌దారులు వెనుదిరుగుతుండడం వంటి దృశ్యాలు బ్యాంకుల్లో విరివిగా కన్పిస్తూనే ఉన్నాయి.

### ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు..

ప్రజాపాలన గ్రామసభల్లో చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. అవన్నీ ప్రభుత్వ ఆమోదం పొందాల్సి ఉంది. ఇక కొత్త పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్లు అందుతాయి.

–విద్యాచందన, అదనపు కలెక్టర్, భద్రాద్రి

# ఖమ్మాన్ని సేఫ్ జిల్లాగా మారుద్దాం..

## జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపులో అదనపు కలెక్టర్ శ్రీజ

రఘునాథపాలెం, జనవరి 31: రోడ్డు భద్రత సామాజిక బాధ్యత అని ప్రతిఒక్కరూ గమనించి నియమాలు పాటిస్తూ సురక్షితమైన ప్రయాణం చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ సూచించారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగిన ముగింపు వేడుకలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రోడ్డు భద్రతా మసోత్సవాల్లో భాగంగా చట్టాలను పటిష్టం చేసేందుకు పోలీస్, రవాణాశాఖ అధికారులు కార్యాచరణ సాగించాలని సూచించారు. విద్యార్థులతో ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి వెంకటరమణ, సీనియర్ ఎంవీఐ వరప్రసాద్, ఏఎంవీఐలు రెంటాల స్వర్ణలత, సుమలత, రవిచందర్‌నాయక్, గోపి, ఖమ్మం ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, అన్ని ఆటో షోరూంల ప్రతినిధులు, డ్రైవింగ్ స్కూల్స్ బాధ్యులు, ఆటో, డీసీఎం, జేసీబీ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ

# 'ఇంటర్నల్' మార్కుల తనిఖీకి 57 బృందాలు

- ప్రతీ టీమ్‌లో ఒక హెచ్ఎం, ముగ్గురు సబ్జెక్టు నిపుణులు
- అన్ని యాజమాన్యాల పరిధిలో 11,12,13 తేదీల్లో తనిఖీలు

ఖమ్మం అర్బన్, జనవరి 31: పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను తనిఖీ చేయడానికి విద్యాశాఖ 57 బృందాలను నియమించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను డీఈవో సోమశేఖర శర్మ శుక్రవారం జారీ చేశారు. సబ్జెక్టు మార్కులు 100 కాగా.. ఫార్మెటివ్ అసెస్‌మెంట్ విధానంలో 20 మార్కులకు పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. వార్షిక పరీక్షల్లో 80 మార్కులకు ప్రశ్నాపత్రాన్ని అందజేయగా.. 20 మార్కులను పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులే మూల్యాంకనం చేసి కేటాయిస్తారు. ఆ మార్కులు, సమాధాన పత్రాలను పరిశీలించి.. ఆయా పాఠశాలలు సక్రమంగా మార్కులు నమోదు చేశారా? లేదా? అనే కోణంలో భాగంగా బృందాలు తనిఖీలు చేపట్టనున్నాయి. ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలను బృందాలు తనిఖీ చేయనున్నాయి.

### సబ్జెక్టు నిపుణుల కేటాయింపు

తనిఖీలకు వెళ్లిన అధికారుల బృందంలో ముగ్గురు సబ్జెక్టు నిపుణులు ఉంటారు. వీరు ఆయా సబ్జెక్టుల ఆధారంగా ప్రతీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తారు. మార్కుల ప్రొఫార్మాను పోల్చుతూ విద్యార్థి రాసిన సమాధాన పత్రాలు సరిగ్గా ఉన్నాయో.. లేవో.. సరిచూస్తారు. దీంతోపాటు విద్యార్థి రాసిన సమాధానాలకు ఉపాధ్యాయులు సరిగ్గా మార్కులు వేశారా? తప్పులు ఏమైనా దొర్లాయా? ఇతరత్రా ప్రభావితం జరిగిందా? అనే కోణంలోనూ పరిశీలిస్తారు. విద్యార్థుల హాజరు పట్టిక, ప్రాజెక్టు రిపోర్టులను పరిశీలిస్తారు. సబ్జెక్టు నిపుణులు పరిశీలించిన వాటిలో హెచ్చుతగ్గులు ఉంటే సంబంధిత బృంద నాయకుడికి వివరిస్తారు. యాజమాన్యాల వారీగా ఎయిడెడ్, బీసీ వెల్ఫేర్, ప్రభుత్వ, ఐటీడీఏ, కేజీబీవీలు, టీఎస్ఎంఎస్, ప్రైవేట్, టీఎస్ఆర్ఎస్, టీఎస్‌డబ్ల్యూఆర్ఈఎస్, జడ్పీలో కలిపి మొత్తం 16,416 మంది విద్యార్థులు పదిపరీక్షలకు హాజరుకానున్నారు. ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజుల పాటు రోజుకు రెండు లేదా మూడు స్కూళ్ల చొప్పున తనిఖీలు చేపట్టనున్నారు.

### ఖమ్మం జిల్లాలో 57 బృందాలు

ఇంటర్నల్ మార్కుల ప్రక్రియలో పాల్గొనేందుకు జిల్లాలో 57 బృందాలను నియమించారు. ప్రతీ బృందానికి ఒక సీనియర్ ప్రధానోపాధ్యాయుడు నాయకత్వం వహిస్తారు. వారి ఆధ్వర్యంలో ప్రతీ బృందానికి ముగ్గురు సబ్జెక్టు ఎక్స్‌ఫర్ట్‌లను నియమించారు. తెలుగు, హిందీ సబ్జెక్టులకు ఒకరు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు ఒకరు, సోషల్, సైన్స్ సబ్జెక్ట్‌లకు ఒకరు చొప్పున నియమించారు. తనిఖీలు ఎలా చేయాలి? ఏయే అంశాలను పరిశీలించాలి? అనే విషయాలపై ఒకటి రెండు రోజుల్లో డీసీఈబీ సెక్రటరీ నారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సూచనలు చేయనున్నారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

## సాయుధ బలగాల డీ మొబిలైజేషన్ పరేడ్‌లో ఎస్పీ రోహిత్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31: పోలీసు శాఖలో పని చేసే ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. పోలీస్ శాఖలో సాయుధ బలగాలకు 15 రోజులుగా నిర్వహించిన మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ పరేడ్‌లో భాగంగా గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్‌కు అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు ప్లాటూన్ కమాండర్‌గా వ్యవహరించారు. 15 రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఇండోర్, ఔట్‌డోర్, ఫైరింగ్ ప్రాక్టీస్‌లలో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారని ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ ఎస్పీకి వివరించారు. ఈ సదర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబిలైజేషన్ కార్యక్రమం ద్వారా శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు.

**ప్రతిభ కనబరిచిన పోలీసులకు మెడల్స్**

పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించిన అధికారులు, సిబ్బందికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మెడల్స్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లా నుంచి ఎంపికైన 260 మంది అధికారులు, సిబ్బందికి ఎస్పీ రోహిత్ రాజు చేతుల మీదుగా వాటిని అందజేశారు. పోలీస్ శాఖలో వారి సేవలకు విభాగాల వారీగా కఠిన సేవా, ఉత్తమ సేవా, సేవా పతకాలతోపాటు యాంత్రిక్ సురక్షా సేవా పతకాలను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పరేడ్ మైదానంలో బహూకరించారు. పోలీసు అధికారులు కురసం సత్యనారాయణ, నాగరాజు, చెన్నూరి శ్రీనివాస్, నర్సింహారావు, సుధాకర్, కృష్ణారావు పాల్గొన్నారు.

సాయుధ బలగాల పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రోహిత్

# ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి: పీవైఎల్, పీవోడబ్ల్యూ

భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో పేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీంతో ప్రైవేటు ఆసుపత్రులు ఫీజుల పేరిట దోచుకుంటున్నాయని ఆరోపించారు.